క్లుప్తంగా

కల్వర్టుల తనిఖీ

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి, నిమ్మగూడెం, పెగడపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో గల కల్వర్టులను ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. వాహనాలను ఆపి వాహన పత్రాలను పరిశీలించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

టేకుమట్ల(రేగొండ): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేగొండ మండలంలోని చిన్నకోడెపాక గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నకోడెపాక గ్రామానికి చెందిన కూనూరు శ్రీనివాస్(72) లనే వృద్ధుడు కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండే వాడు. దాంతో తీవ్ర మనస్థాపానికి చెందిన ఆయన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు కిందకు దూసుకెళ్లిన లారీ

- ద్విచక్రవాహనదారుడికి తృటిలో తప్పిన ప్రమాదం

మహాముత్తారం: లారీ రోడ్డు కిందకు దూసుకెళ్లిన సంఘటన మండలకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలోని దౌత్‌పల్లి–డొబ్బల్‌పాడ్ మధ్య శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నల్గొండ జిల్లా నుంచి శనివారం మహాముత్తారం మండలానికి ఓ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్తున్న లారీ డొబ్బల్‌పాడ్ ప్రధాన రహదారిలో రివర్స్ తీసుకునే క్రమంలో రోడ్డు కిందకు దూసుకువెళ్లింది. ఆ క్రమంలో అక్కడే ఆగి ఉన్న ఓ ద్విచక్ర వాహనదారుడు ఫోన్ మాట్లాడుకుంటూ నిలబడ్డాడు. లారీ వెనకకు వచ్చే దాన్ని గమనించి బండిని వదిలి పరుగెత్తడంతో బండిపై నుంచి లారీ దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం అయింది. వాహనదారుడు పరుగు పెట్టకుంటే భారీ ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

ఢీకొట్టి వెళ్లిపోయిన వాహనం పట్టివేత

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లి గ్రామానికి చెందిన అనుముల సుగుణ, ఆమె కుమారుడు శ్రీధర్ శుక్రవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మొట్లపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టాటా ఏసీ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో శ్రీధర్‌కు గాయాలు అయ్యాయి. సుగుణ శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల సాయంతో వాహనం, యాజమాని వివరాలు తెలుసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని పట్టుకున్నామని, నిందితుడు దొరలేదని త్వరలో పట్టుకుంటామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి

చిట్యాల: విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని చింతకుంట రామయ్యపల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్లపెల్లి కుమార్ పాడి గేదె రోజు వారిలాగే ఉదయం గ్రామ శివారులో మేత కోసం తీసుకెళ్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలి విద్యుత్ షాక్‌గురై అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

'అనుమతులున్నా బెదిరింపులు'

కాళేశ్వరం: తమకు పట్టాతో ఇంటి నిర్మాణం అనుమతి ఉన్న కక్ష పూరితంగా బెదిరింపులకు గురిచేస్తున్నారని కాళేశ్వరం ఎస్టీ కాలనీకి చెందిన బండ రాజేశ్వరి ఆరోపించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాము గత కొన్ని సంవత్సరాలుగా 129 సర్వేనంబర్‌లో 16 గుంటల భూమిలో కాస్తులో ఉన్నామని, ఇంటికి అనుమతి ఉందని తెలిపారు. కానీ కాళేశ్వరానికి చెందిన మహేష్ అనే వ్యక్తి తమకు పట్టా లేదని ఆక్రమించాడని, గతేడాది అక్టోబర్‌లో గొడవలు జరుగగా కేసు నమోదైందన్నారు. కేసు కోర్టులో ఉండటంతో కేసు కాంప్రమైజ్ కావాలని ఇంటి చుట్టూ తిరుగుతూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

11న సమావేశం

భూపాలపల్లి రూరల్: ఈనెల 11వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో నిర్వహించనున్న జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఎమార్పీఎస్ నాయకులు తరలిరావాలని తెలిపారు. భరత్, నవీన్, పవన్ ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు


గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఓపెన్‌కాస్ట్–2 ప్రభావిత గడ్డిగానిపల్లి గ్రామంలో అర్హులైన భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే గండ్ర వెంకరమణారెడ్డి, కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం భూపాలపల్లి మండలం గడ్డిగానిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భూసేకరణ గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. 2015 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న గడ్డిగానిపల్లి ప్రాంత ప్రజల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గ్రామంలో సర్వే నిర్వహించి భూ నిర్వాసితులను గుర్తిస్తామని, అర్హులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందిస్తామని తెలిపారు. రెండు నెలల్లో సర్వే పూర్తి చేసి గ్రామసభ నిర్వహించి గుర్తించిన అర్హుల వివరాలు, వారికి వచ్చే పరిహారం వివరాలు తెలియజేస్తామని అన్నారు. గ్రామం నుంచి తరలించాల్సిన ప్రతి పీడీఎఫ్ కుటుంబానికి రూ.7.5 లక్షల పరిహారం అందిస్తామని, భూపాలపల్లి జిల్లాలో మంజూర్‌నగర్ సమీపంలోని సింగరేణి 8ఇంక్‌లైన్ కాలనీ వెనుకాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మిస్తామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతీ కుటుంబానికి భూమి కేటాయించి, అవసరమైన మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ, కమ్యూనిటీహాల్, దేవాలయం, పాఠశాల నిర్మాణం పూర్తి చేసి తరలిస్తామన్నారు. మల్హర్‌రావు మండలం, తాడిచర్ల గ్రామంలో భూ నిర్వాసితుల సమస్య చాలా కాలంగా పెండింగ్ ఉందని, అక్కడ సమస్య పరిష్కారం చేసి 230 కుటుంబాల తరలింపు ప్రక్రియ చేపట్టామని కాలనీ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, గనపూరం మండలం దుబ్బపల్లి గ్రామంలో ఉన్న సమస్య సైతం పరిష్కారం అవుతుందన్నారు. గ్రామంలో అధిక శాతం ఎస్సీ వర్గానికి చెందిన ప్రజలు ఉన్నారని, వీరికి భవిష్యత్‌లో ఉపాధి కల్పించే విధంగా కార్పొరేషన్ రుణాల, ఇతర పథకాల అమలులో ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు. సమావేశం అనంతరం పక్కనే ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడి భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, ఆర్డీవో శ్రీనివాస్, సింగరేణి జీఎం శ్రీనివాసరావు, తహసీల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి దాతల చేయూత


దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కాటారం: మండల కేంద్రంలోని గారెపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు చేయూతనందిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మండల కేంద్రానికి చెందిన రంగు బాపు సరోజన దంపతులు రూ.1,00116, కొట్టె మహేందర్, మనోజ్ అతడి తండ్రి జ్ఞాపకార్థం రూ.20,016, బండం సునీల్ రూ.10,116లు విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు. విరాళాలు ఇచ్చిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొట్టె శంకరయ్య, జక్కు మొగిలి, ప్రభాకర్, శ్రీహరి, రాంచంద్రం పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి పనిచేయాలి


మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

టేకుమట్ల(రేగొండ): బూత్‌స్థాయి నుంచి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శనివారం రేగొండ మండలకేంద్రంలో వర్చువల్ ప్రోగ్రాంలో భాగంగా పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురడం ఖాయమన్నారు. జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, జిల్లా ఇన్‌చార్జ్ ఉదయ్‌ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నిశీధర్‌రెడ్డి, ఎరుకల గణపతి, మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపెల్లి ప్రతాప్‌రావు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


భూపాలపల్లి అర్బన్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు


మహాముత్తారంలో..

భూపాలపల్లి అర్బన్: పీఆర్‌టీయూ తెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. శ్రీనివాస్, శంకర్, రమేష్, కుమారస్వామి, అశోక్, శ్రావణ్ పాల్గొన్నారు.

మహాముత్తారం: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని శనివారం మండలకేంద్రంలో తహసీల్దార్ మాధవి, ఎంపీడీఓ రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ములుగుపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలరాజుతో పాటు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బోజ్యానాయక్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహిన్, విజయ్, ఆడిట్ కమిటీ కన్వీనర్ మల్లేషం, కమిటీ సభ్యులు దేవిసింగ్, సుమన, విజయలక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాటలు నమ్మి మోసపోవద్దు


మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: సీఎం కేసీఆర్ గారడి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో సామన్య ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలను పెంచడంతో పాటు, నిరుద్యోగుల్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర నియంత పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పరామర్శ..

మండలంలోని గర్మిళ్లపల్లి, సుబ్బక్కపల్లి గ్రామాలకి చెందిన తిప్పారపు ఓదెలు, నల్లెల సమ్మయ్య, బొడ్డు సమ్మయ్యలు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సత్యనారాయణరావు పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వైనాల రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు నాంపెల్లి వీరేశం, నాయకులు పెరుమాండ్ల లింగయ్య, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, మోతె రాజమౌళి, దాసారపు సదానందం, శాస్త్రాల కిరణ్, జంగ మధూకర్, యశ్వంత్, భూపెల్లి రవీందర్, క్రాంతి, రమేష్, రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు


మాట్లాడుతున్న నాయకులు

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని జెడ్పీటీసీ జోరుక సదయ్య, ఎంపీపీసుజాత సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తుంటే అభివృద్ధిని చూడలేని దుస్థితిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారన్నారు. ప్రభుత్వం నిరుపేదలందరికి ఇళ్లను అందించడం కోసం ప్రణాళికలు తయారు చేసిందని రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలందరికీ తప్పకుండా వస్తాయన్నారు. వైస్ ఎంపీపీ రాజేశ్వర్ రావు, సర్పంచ్ ధర్మారావు, ఎంపీటీసీ వనిత పున్నం చందర్ రావ్, మాజీ సర్పంచ్ శ్రీహరి పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై చిన్నచూపు సరికాదు


మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కాటారం: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి దళితరాలు అయినందుకే జిల్లా అధికార యంత్రాంగం, అధికార పార్టీ నాయకులు చిన్నచూపు చూస్తూ అడుగడుగున అవమానిస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. కాటారం మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఓ దళిత మహిళా అని కూడా చూడకుండా అధికారులు, అధికార పార్టీ నాయకులు ప్రతి సమావేశంలో అవమానపరుస్తున్నారని విమర్శించారు. మంథని నియోజకవర్గంలో అధికంగా ఎస్సీ, ఎస్టీలు ఉన్న నేపథ్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ఆలయ చైర్మన్ పదవి ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు బుర్రి శివరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొయ్యల సత్యం, యువైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, మాలభేరి రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్, నాయకులు సాంబయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌ల నియామకం

టేకుమట్ల(రేగొండ): జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సోషల్ మీడియా వారియర్స్‌లో బీఆర్‌ఎస్ రేగొండ మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా దాట్ల రాజేందర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు సోషల్ మీడియా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, ఎమ్మెల్యేకు, మండల నాయకులకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

కాటారం: బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం మండల ఇన్‌చార్జ్‌గా మండలంలోని చిద్నెపల్లికి చెందిన వంగళ రాజేంద్రాచారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శనివారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పుట్ట మధు, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఆంగ్ల భాష అవసరం


చిట్యాల: ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: ప్రస్తుత సమాజంలో ఆంగ్ల బోధన విద్య విద్యార్థులకు ఎంతో అవసరమని ఎంఈఓ కోడెపాక రఘుపతి అన్నారు. విద్యాశాఖలోని ఎస్సీఆర్టీ జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాషలో వివిధ రకాల స్టోరీ పోటీలు నిర్వహించారు. ముందుగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఆంగ్లంలో సెల్పింగ్, వాక్చాతుర్యం, కమ్యూనికేషన్ స్కిల్ పెంపొందించే విధంగా కథల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ రఘుపతి హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆంగ్ల బోధన విద్యపై నిర్వహించే పోటీలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని అన్నారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్లభాషలో ప్రతిభను కనబరిస్తే అనేక విద్య, ఉద్యోగాలతో పాటు ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నిలిమా రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ రమేష్, సాంబయ్య విద్యార్థులు పాల్గొన్నారు.


టేకుమట్లలో..


మొగుళ్లపల్లిలో..

టేకుమట్ల: మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మండలంలోని వెలిశాల ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్‌లో స్పెల్లింగ్ విజార్డ్ మొదటి స్థానంలో ఉదయ్‌రాజ్, ద్వితీయ స్థానంలో శివాంజలీ, స్టోరీ టెల్లింగ్ విభాగం ప్రథమ స్థానంలో శివాంజలీ, ద్వితీయ స్థానంలో అలియాతైసీన్‌లు ప్రతిభ కనబర్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి, నోడల్ ఆఫీసర్లు జగన్నాథం, ప్రవీన్, తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో శనివారం స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్‌లో మండల స్థాయిలో నిర్వహించిన పోటీలో మోడల్ స్కూల్ విద్యార్థులు నిత్య 8వ తరగతి స్టోరీ టెల్లింగ్‌లో ప్రథమ స్థానంలో, స్పెల్ విజార్డ్‌లో ఎస్.హర్షవర్ధన్ ప్రథమ స్థానం, ఎస్.సాత్విక ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కె.సుధీర్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయులు రమేష్, ఆంగ్ల ఉపాధ్యాయులు, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధీర్ రెడ్డి, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


జివాకర్‌రెడ్డి, కాటారం తహసీల్దార్


శ్రీనివాస్, తాడిచర్ల తహసీల్దార్

కాటారం/మల్హర్: కాటారం తహసీల్దార్‌గా లాక్కాకుల జివాకర్‌రెడ్డి, మల్హర్ మండలం తాడిచర్ల తహసీల్దార్‌గా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రెండు రోజుల క్రితం జిల్లాలో పలువురు తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ కలెక్టర్ భవేశ్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కాటారం తహసీల్దార్‌గా పని చేసిన శ్రీనివాస్‌రావును కలెక్టర్ కార్యాలయానికి, మల్హర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న జివాకర్‌రెడ్డిని కాటారానికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తాహసీల్దార్లను కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

చిట్యాల తహసీల్దార్‌గా సమ్మయ్య



చిట్యాల: చిట్యాల మండల తహసీల్దార్‌గా సమ్మయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి భూపాలపల్లి జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. నూతనంగా వచ్చిన తహసీల్దార్ సమ్మయ్యను అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు పుల్ల మల్లయ్య సన్మానించారు.

మహదేవపూర్ తహసీల్దార్‌గా శంకర్

మహదేవపూర్: మండల నూతన తహసీల్దార్ శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చే స్తున్న తహసీల్దార్‌గా శ్రీనివాస్ బదిలీపై మల్హర్‌కు వెళ్లారు.

బంగారం అమ్ముకున్నారని నిరసన


నిరసన తెలుపుతున్న బాధితులు

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని మణప్పురం గోల్డ్‌లోన్ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వేలం వేసి అమ్ముకున్నారని కుందూరుపల్లి గ్రామానికి చెందిన బాధితులు భూక్య రాజు అతడి భార్యతో కలిసి శనివారం నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుందూరుపల్లి గ్రామానికి చెందిన భూక్య రాజు 8 నెలల క్రితం ఇల్లు కట్టేందుకు 10 తులాల బంగారాన్ని మణప్పురం గోల్డ్‌లోన్‌లో తనాఖా పెట్టి డబ్బులు తీసుకున్నాడు. అప్పటి నుంచి తీసుకున్న డబ్బులకు వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులో పెట్టిన 10 తులాల బంగారాన్ని విడిపించుకునేందుకు డబ్బులు తీసుకొనివచ్చినట్లు తెలిపారు. బ్యాంకులో కట్టే సమయంలో అందులో నుంచి 2 తులాల బంగారం వేలం వేశామని గోల్డ్ లోన్ సిబ్బంది తెలిపారు. దీంతో కంగుతున్న బాధితుడు తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా బంగారాన్ని వేలం వేశారని సిబ్బందితో వాగ్వివాదానికి దిగాడు. అనంతరం తన బంగారం తనకు కావాలని చొక్కావిప్పి బ్యాంకు వెలుపల బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ విషయమై మణప్పురం బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా తనాఖా పెట్టిన బంగారం గడువు ముగుసిందని వారికి సమాచారం ఇచ్చామని, నోటీసులు కూడా పంపించినట్లు తెలిపారు.

రాజేశ్వరరావు జీవితం ఆదర్శనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పుల్లూరి రాజేశ్వరరావు రాజకీయ జీవితం, వ్యక్తిత్వం నేటి తరం నాయకులు, కార్యకర్తలకు ఆదర్శనీయం అని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాజేశ్వరరావు సంతాప సభకు శ్రీధర్‌బాబు హాజరయ్యారు. రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాప సభలో మాట్లాడారు. రాజకీయాల్లో వారి ఎదుగుదల గూర్చి మాత్రమే స్వార్థంగా ఆలోచించే పలువురు నాయకులు ఉంటారని కానీ రాజేశ్వరరావు పార్టీలో ఎందరో నాయకులు, కార్యకర్తలను వెన్నంటి ప్రోత్సహించి గొప్ప స్థాయికి తీసుకొచ్చారని కొనియాడారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, బెల్లంకొండ నర్సింగారావు, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, బ్లాక్ అధ్యక్షుడు కోట రాజబాబు, తెప్పెల దేవేందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, అంగజాల అశోక్, చీమల సందీప్, కదారి విక్రమ్, దబ్బెట రాజేశ్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో సునీల్‌రెడ్డి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని నాగేపల్లి, అన్నారం గ్రామాలకు చెందిన ఆలం కొమురయ్య, సుదాకర్, పూతల స్వామి, శనిగరం నీరేష్, పూతల రామస్వామి, లడ్డూ, రాజుతోపాటు మరికొంత మంది యువకులు శనివారం బీజేపీలో చేరారు. వీరికి పార్టీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి కండువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీమన్నారాయణ, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు సంతోష్, కిషన్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.